సాక్షి
ఆదిలాబాద్

మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



బడులకు నిధులు 8లో▸

సర్కారు బడుల నిర్వహణకు తొలివిడత 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సనాతన ధర్మ పరిరక్షణే ధ్యేయం

ఆదిలాబాద్: సనాతన ధర్మ పరిరక్షణే ధ్యేయంగా సనాతన హిందూ ఉత్సవ సమితి ముందుకెళ్తోందని సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి అన్నారు. హిందూ ధర్మానికి ఎంతో విశిష్టత ఉందన్నారు. సనాతన ధర్మ వైశిష్ట్యాన్ని తెలిపే విధంగా సమితి ఆధ్వర్యంలో పండుగలు నిర్వహిస్తున్నామన్నారు. 13 ఏళ్లుగా అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.2/24.4

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. అల్పపీడనం, రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టరేట్ ఎదుట ఐటీఐ విద్యార్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఐటీఐ విద్యార్థులు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ మాట్లాడుతూ కొన్ని నెలలుగా కళాశాలలో అధ్యాపకులు లేక విద్యార్థులకు బోధించే వారు కరువయ్యారన్నారు. తరగతులు జరుగక విద్యార్థులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని, వారి భవిష్యత్తు ఏం కావాలంటూ ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నిబంధనలు పాటించని ఆస్పత్రులపై చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న జాన్‌బాబు

ఆదిలాబాద్‌టౌన్: నిబంధనలు పాటించని ఆస్పత్రులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని వైద్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్‌బాబు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేశారు. 2010 ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? అనే విషయాలపై ఆరా తీశారు. ఫైర్ సేఫ్టీ, పొల్యూషన్, ధరల పట్టిక, సిబ్బంది అర్హత, తదితర వివరాలను పరిశీలించారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో కృష్ణ, ప్రోగ్రాం అధికారులు నరేందర్ రాథోడ్, గజానన్, తదితరులు ఉన్నారు.

'జిల్లాలో హైడ్రా అమలు చేయాలి'



మాట్లాడుతున్న మల్యాల మనోజ్

ఆదిలాబాద్‌రూరల్: హైదరాబాద్ తరహాలో ఆదిలాబాద్ జిల్లాలో సైతం హైడ్రా అమలు చేసే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ మాదిగ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని చెరువులు, నాలాలను కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి అందులో లేఅవుట్లు సైతం వేశారని ఆరోపించారు. వాటిని తొలగించేందుకు ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జేఏసీ జిల్లా కోశాధికారి లింగంపల్లి ప్రసన్న కుమార్ మాదిగ, జిల్లా కార్యదర్శి తార రవికుమార్ మాదిగ, నాయకులు శ్రీనివాస్ మాదిగ పాల్గొన్నారు.

కుష్ఠురహిత సమాజానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జాన్‌బాబు

బేల: కుష్ఠు రహిత సమాజం కోసం వైద్య సిబ్బందితో పాటు ప్రతిఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని కుష్ఠు వ్యాధి నివారణ రాష్ట్ర బృందం సభ్యులు జాన్‌బాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని బృందంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశాలకు కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే ఎలాంటి వైకల్యం రాకుండా మందులు, మాత్రలతోనే పూర్తిగా నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో బృందం సభ్యులు డీపీఎంవో సకలరెడ్డి, వెంకటేశ్వరచారి, ఎం. శ్రీనివాస్, సుధాకర్, జిల్లా అధికారులు గజానన్, మధుకర్‌రావు, పీహెచ్‌సీ వైద్యులు వంశీకృష్ణ, సిబ్బంది అనిల్, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు పంచాయితీ

భీంపూర్ మండలం అర్లి(టి) గ్రామానికి చెందిన కన్నాల నవీన్ ఓటు 5వ వార్డులో ఉంది. అతని తల్లిదండ్రులు, భార్య ఓట్లు 6వ వార్డులో ఉన్నాయి. దీంతో తన ఓటును ఆరోవార్డుకు చేర్చాలని నవీన్ గ్రామపంచాయతీ అధికారులకు తెలియజేశాడు. దానిపై స్పందించిన వారు అతని పేరును ఆరోవార్డుకు మార్చారు. జిల్లాలో ఇలాంటి అభ్యంతరాలు వెయ్యికి పైగా వచ్చాయి. వాటిని పరిష్కరించాల్సి ఉంది. ఆ తర్వాత తుది ఓటరు జాబితాను గ్రామపంచాయతీ వారీగా ప్రదర్శించనున్నారు.



మావల జీపీలో ఓటరు జాబితా పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్

- మా ఇంట్లో వ్యక్తుల్ని ఒకే వార్డుకు చేర్చండి..
- అన్నదమ్ముల కుటుంబ సభ్యుల్ని దీంట్లోనే కలపండి
- ముసాయిదా జాబితా విడుదల తర్వాత అభ్యంతరాల వెల్లువ
- పరిష్కారం కోసం పరిశీలన
- 29న తుది జాబితా

సాక్షి,ఆదిలాబాద్: ప్రభుత్వం పంచాయతీ ఓటర్ల ముసాయిదా జాబితాను ఈనెల 13న విడుదల చేసింది. ఆ తర్వాత అందులో ఉన్న అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరించింది. ఇప్పటికే ఈ స్వీకరణ ప్రక్రియ ముగిసింది. ప్రస్తుతం వాటి పరిశీలన కొనసాగుతోంది. ఈ నెల 26 వరకు వాటిని పరిష్కరించాల్సి ఉంది. ఆ తర్వాత 29న గ్రామపంచాయతీలో ఓటరు తుది జాబితాను ప్రదర్శించనున్నారు.

అభ్యంతరాల వెల్లువ..

ముసాయిదా జాబితా విడుదల తర్వాత గ్రామ పంచాయతీల్లో వార్డు గురించి అభ్యంతరం వ్యక్తం చేస్తూ సవరణ చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో ఇలాంటివి వెయ్యికి పైగా వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. వార్డు మెంబర్‌గా పోటీ చేయాలనే ఆసక్తి ఉన్నవారు తమకు అనువైన ఓటర్లను తన వార్డులోకి తెచ్చుకునే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అందుకోసం తన అన్నదమ్ములు, దగ్గరి వారు ఇతర వార్డుల్లో ఉంటే వారిని ఈ వార్డులో చేర్చాలని దరఖాస్తు చేసుకున్నారు. వార్డు నుంచి వలస వెళ్లిపోయి మరోచోట స్థిర నివాసం ఏర్పర్చుకున్నప్పటికీ వార్డుతో ఉన్న అనుబంధం, అక్కడే ఓటు వేయాలనే ఆసక్తితో తన ఓటును ఆ వార్డులోనే ఉంచాలని కొంత మంది దరఖాస్తు చేసుకున్న పరిస్థితి ఉంది. అయితే వార్డులో పోటీ చేయాలనుకునే వారు తమ అనుకునే వారిని జాబితాలో చేర్చే ప్రయత్నంలో ఇలా దరఖాస్తు చేసుకున్నప్పటికీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడం, నిబంధనల మేరకు మార్పులు చేర్పులు చేయడం వంటివి జరుగుతున్నాయి. మొత్తంగా పంచాయతీల్లో ప్రస్తుతం ఓటరు జాబితా సవరణ ప్రాధాన్యత సంతరించుకుంది.

జీపీల్లో కసరత్తు..

తుది ఓటరు జాబితా కోసం గ్రామ పంచాయతీల్లో కసరత్తు కొనసాగుతోంది. ఇలాంటి అభ్యంతరాల విషయంలో పంచాయతీ సెక్రటరీలు, కారోబార్‌లు పరిశీలన చేస్తున్నారు. అభ్యంతరానికి సంబంధించి క్షేత్రస్థాయిలో పర్యటించి నిజ నిర్ధారణ చేసుకుని సవరణకు సిద్ధమవుతున్నారు. లేనిపక్షంలో గైడ్‌లైన్స్ ప్రకారం ఇది కుదరదని చెబుతున్నారు. ప్రధానంగా ఒక పంచాయతీలో పది వార్డులు ఉంటే మొత్తం ఓటర్లు 2వేలకు పైగా ఉన్నారనుకుంటే.. ఈ సవరణలో ఒక వార్డు నుంచి మరో వార్డుకు మార్చే వీలున్నప్పటికీ ఆ ఓటును తీసివేయడం, లేనిపక్షంలో కలపడం వంటిది చేసే వీలు లేదు.

జీపీలు, వార్డులు, ఓటర్ల వివరాలు..	
గ్రామ పంచాయతీలు	473
మొత్తం వార్డులు	3,870
మొత్తం ఓటర్లు	4,41,700
పురుషులు	2,16,242
మహిళలు	2,25,442
ఇతరులు	15

రిజర్వేషన్లపై ప్రభావం చూపేనా..

వార్డులో వచ్చిన అభ్యంతరాలు పెద్ద ఎత్తున ఉంటే ఆ వార్డు రిజర్వేషన్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు. ఒకవార్డు నుంచి మరొక వార్డుకు కొంత మందిని మార్చినప్పుడు అంతకుముందు సహజంగానే ఆ వార్డులో సంబంధిత ఓటర్ కమ్యూనిటీ సంఖ్య తగ్గుతుంది. దీంతో అది రిజర్వేషన్‌పై ప్రభావం చూపుతుందా? అనే సందిగ్ధం కూడా ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు ఓటరు జాబితా పరంగా ఆచితూచి పరిశీలన చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన జాబితాకు అనుగుణంగా వార్డుల్లో మార్పులు చేర్పుల పరంగా అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని ముందుకెళ్తున్నారు. దీంతో ఈ పరిశీలన ప్రక్రియ అధికారులకు ఓ కత్తిమీద సాములా మారింది.

29న తుది జాబితా..



ప్రస్తుతం పంచాయతీల్లో అభ్యంతరాల పరిష్కారం కోసం పరిశీలన జరుగుతోంది. 28 వరకు ఇది పూర్తవుతుంది. 29న తుది జాబితా విడుదల చేస్తాం. ఎన్నికల కమిషన్ గైడ్‌లైన్స్ ప్రకారం మార్పులు చేర్పులు చేపడుతున్నారు.

– ఫణిందర్‌రావు, డీఎల్‌పీవో, ఆదిలాబాద్

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎస్పీ గౌస్ ఆలం



కుటుంబ సభ్యులకు చెక్ అందిస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు బాధిత కుటుంబ సభ్యులకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. సోమవారం రెండు కుటుంబాలకు రూ.5 లక్షల సాలరీ ప్యాకెజ్ ఇన్సూరెన్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పోలీసు సిబ్బందికి ఎస్‌బీఐలో సాలరీ ప్యాకెజ్ అకౌంట్‌లోకి మార్చడం జరిగిందన్నారు. ప్రమాదవశాత్తు, సాధారణంగా సిబ్బంది మరణిస్తే త్వరితగతిన ఇన్సూరెన్స్ అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది హఠాన్మరణం చెందిన పోలీసులు మారుతి, మార్కండేయ కుటుంబ సభ్యులకు రూ.5లక్షల చొప్పున ఇన్సూరెన్స్ డబ్బులు అందించినట్లు తెలిపారు. రాష్ట్రంలో మొదటిసారిగా పోలీస్ సాలరీ ప్యాకెజ్ ఇన్సూరెన్స్ ద్వారా వీరు లబ్ధి పొందారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్ రావు, డీఎస్పీ పోతారం శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ బ్యాచ్ మిత్రుల ఉదారత

జిల్లా కేంద్రానికి చెందిన యూసుఫ్ ఖాన్ హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయంలో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. 1989 పోలీస్ బ్యాచ్ మిత్రులు సోమవారం బాధిత కుటుంబానికి ఎస్పీ చేతుల మీదుగా రూ.50 వేల చెక్కును అందించి ఉదారత చాటారు. ఈ కార్యక్రమంలో కోర్టు లైజన్ అధికారి తాజొద్దీన్, ఈశ్వర్‌సింగ్, రాఘవేంద్ర, ఏఎస్సై సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

కైలాస్‌నగర్: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ నారాయణ డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల దేశవ్యాప్త నిరసనలో భాగంగా సోమవారం బ్లాక్ డే నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి అనేక పోరాటాల ద్వారా 29 కార్మిక చట్టాలను సాధించుకుంటే కేంద్ర బీజేపీ ప్రభుత్వం వాటిని నాలుగు లేబర్ కోడ్‌లుగా మారుస్తూ కార్మిక హక్కులను కాల రాసిందన్నారు. లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, పాత పెన్షన్ విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, జిల్లా కమిటీ సభ్యులు పండుగ పొచ్చన్న, ఆర్.సురేందర్, దర్శనాల నగేష్, ఐఎఫ్‌టీయూ నాయకులు నర్సింగ్, సుభాష్, శేషరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి



సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు

నేరడిగొండ: ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జలెందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తర్నం, కుమారి, కుప్టి, లఖంపూర్, బుగ్గారం, వాంకిడి, నేరడిగొండ, వడూర్ గ్రామాల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యాబోధన చేయాలన్నారు. ప్రభుత్వం డీఎస్సీ నియామకాలు దసరాలోగా పూర్తి చేయాలని, పెండింగ్ డీఏలతో పాటు ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను అందించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయడంతో పాటు పీఆర్సీ వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి మధుసూదన్‌రెడ్డి, జిల్లా నాయకులు ప్రఫుల్‌చందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎస్వీ రమణారెడ్డి, కిరణ్ కుమార్, జగదీష్‌రెడ్డి, అంజన, దేవి, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

మండల కార్యవర్గం ఎన్నిక..

తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) నేరడిగొండ మండల శాఖను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్వీ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కిరణ్ కుమార్, గౌరవ అధ్యక్షుడిగా గంగాధర్, ఆర్థిక కార్యదర్శిగా జాదవ్ జగదీష్‌ను ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజావాణికి రికార్డుస్థాయి వినతులు

- గతంలో ఎన్నడూ లేని విధంగా 160 అర్జీలు
- మధ్యాహ్నం 3:40 వరకు దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: రెండు వారాల విరామం తర్వాత సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి రికార్డుస్థాయిలో అర్జీలు వెల్లువెత్తాయి. గతంలో ఎన్నడూలేని విధంగా 160 అర్జీలు రావడం గమనార్హం. అర్జీదారులు అధికసంఖ్యలో తరలిరావడంతో కలెక్టరేట్ సమావేశ మందిరం కిటకిటలాడింది. ప్రతీవారం 2 గంటలకే కార్యక్రమం ముగుస్తుండగా ఈవారం మధ్యాహ్నం 3.40 గంటల వరకు అర్జీల స్వీకరణ కొనసాగింది. కలెక్టర్ రాజర్షిషా లంచ్‌కు సైతం వెళ్లకుండా అధికారులతో కలిసి బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులకు అందజేస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీఆర్‌డీవో సాయన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ వారం అర్జీదారుల్లో కొందరి నివేదన...

ఉపాధ్యాయులను నియమించాలి



మా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 73 మంది విద్యార్థులు చదువుతున్నారు. ముగ్గురు ఉపాధ్యాయులకు ఒకరు పదోన్నతిపై వెళ్లగా మరొకరు ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. బదిలీల్లో భాగంగా పాఠశాలకు నియామకమైన ఉపాధ్యాయుడు ఇప్పటి వరకు విధుల్లో చేరలేదు. దీంతో ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు బోధించాల్సి ఉండటంతో విద్యార్థులకు చదువు అందని పరిస్థితి నెలకొంది. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలి. – విద్యార్థుల తల్లిదండ్రులు, పొన్నారి, తాంసి

ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలి



అర్హులైన దివ్యాంగులకు జిల్లా కేంద్రంలో ఇంటి స్థలాలు కేటాయించి ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలి. 55 మంది దివ్యాంగుల కుటుంబాల్లో ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు ఉండటంతో వారికి దివ్యాంగుల పెన్షన్ రావడం లేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. పెన్షన్ నిబంధనలను సవరించి చేయూత కింద వారికి పెన్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలి. – దివ్యాంగులు, ఆదిలాబాద్

పీఎం విశ్వకర్మ వర్తింపజేయాలి

పూర్వీకుల కాలం నుంచి తాపీమేస్త్రీ పనినే కులవృత్తిగా చేస్తున్నాం. దానిపైనే ఆధారపడి జీవిస్తున్నాం. ఇటీవల ప్రభుత్వం మా కులాన్ని బీసీఏ–64లో చేరుస్తూ గుర్తింపునిచ్చింది. కానీ ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని వర్తింపజేయడం లేదు. దీంతో కేంద్రమిచ్చే ప్రభుత్వ ఆర్థిసాయం, శిక్షణ పొందలేకపోతున్నాం. ప్రభుత్వం ఓడ్ కులస్తుల సమస్యలను గుర్తించి పీఎం విశ్వకర్మ పథకం వర్తింపజేయాలి. – ఓడ్ కులస్తులు, ఆదిలాబాద్



మూడేళ్లుగా తిరుగుతున్నా..



దివ్యాంగుడినైన నాకు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. రెండు పంటలు సాగు చేసేందుకు చేనులో బోరు వేసి విద్యుత్ కనెక్షన్ తీసుకున్నా. బేల ట్రాన్స్‌కో ఎస్ఈ నా వ్యవసాయ సర్వీస్ కనెక్షన్‌ను వేరే ట్రాన్స్‌ఫార్మర్‌కు బదలాయింపు చేస్తానని కనెక్షన్‌ను తొలగించారు. మళ్లీ కనెక్షన్ ఇవ్వకుండా మూడేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కేవలం వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్నా. నీటి వసతి ఉన్నప్పటికీ మరో పంట వేసే అవకాశం లేదు. విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించాలి.

– వాంకడే నారాయణ, దహేగాం, బేల

పంట నీట మునిగింది



గత ప్రభుత్వం దళితబస్తీ కింద బేల మండలంలోని నారాయణపూర్ శివారులో మూడెకరాల భూమి మంజూరు చేసింది. దాన్ని సాగు చేస్తూ జీవిస్తున్నా. ఇటీవల బ్రిడ్జీ నిర్మించడంతో కాలువ నీరంతా చేనులోకి వచ్చి పంట పూర్తిగా మునిగిపోయింది. నిరుపేదనైన నాకు న్యాయం చేసి పంటను సంరక్షించేలా చర్యలు తీసుకోవాలి.

– సంకపాక శంకర్, కరంజి(కే), బేల

నిధులున్నా నిర్లక్ష్యమేనా...!

- పల్లె సచివాలయాలను పట్టించుకోని వైనం
- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని నిర్మాణాలు
- స్థలాల్లేక పలుచోట్ల ప్రారంభం కాని వైనం
- సమావేశాల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు

జిల్లా వివరాలు
మంజూరైన గ్రామ పంచాయతీ భవనాలు: 101
ప్రారంభం కాని పంచాయతీలు: 26
వివిధ దశల్లో ఉన్న పంచాయతీలు: 70
పూర్తయిన పంచాయతీలు: 05

కైలాస్‌నగర్: గ్రామ పరిపాలనకు కేంద్ర బిందువైన పల్లె సచివాలయాల నిర్మాణాలపై నిర్లక్ష్యపు గ్రహణం నెలకొంది. ప్రతీ పంచాయతీకి సొంత భవనం ఉండాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ప్రత్యేక నిధులను విడుదల చేసింది. ఒక్కో పంచాయతీకి రూ.10 లక్షల చొప్పున కేటాయిస్తూ జిల్లాకు 101 పంచాయతీ భవనాలను మంజూరు చేసింది. వాటిని త్వరితగతిన ప్రారంభించి పూర్తయ్యేలా చూడాలని ఆదేశించింది. అందుకు సంబంధించి నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, పాలకుల పట్టింపులేనితనంతో భవన నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. మంజూరై రెండేళ్లవుతున్నా ఇప్పటి వరకు పదుల సంఖ్యలో నిర్మాణాలు ప్రారంభానికి నోచుకోకపోగా ప్రారంభమైనవి సైతం పూర్తి కావడంలేదు. పక్కా భవనాలు లేకపోవడంతో అద్దె గదుల్లో, ఇతర ప్రభుత్వ భవనాల్లో పంచాయతీలు నిర్వహిస్తున్నారు. దీంతో సమావేశాల నిర్వహణకు పంచాయతీ కార్యదర్శులతో పాటు వివిధ పనుల కోసం వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.



తాంసిలో పిల్లర్లకే పరిమితమైన భవనం

రెండేళ్లు గడిచినా నిర్లక్ష్యమేనా?

గ్రామ పరిపాలనలో సచివాలయాల పాత్ర ఎంతో కీలకమైంది. పాలకవర్గ సమావేశాల నిర్వహణతో పాటు పంచాయతీ పరిధిలోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా ప్రతీ పంచాయతీకి పక్కా భవనం ఉండాలని కేంద్రం సంకల్పించింది. ఇందుకోసం జిల్లాలోని 101 జీపీలకు పక్కా భవనాలు మంజూరు చేసింది. ఒక్కో పంచాయతీకి రూ.10లక్షల చొప్పున నిధులను కేటాయిస్తూ 2022 డిసెంబర్‌లో ఉత్తర్వులు జారీ చేసింది. వీటి నిర్మాణ బాధ్యతలను సర్పంచులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులకు అప్పగించింది. రెండేళ్లు గడిచినప్పటికీ పంచాయతీ భవనాల నిర్మాణాలు మాత్రం ఇప్పటికీ పూర్తి కాలేదు. అప్పటి ప్రజాప్రతినిధుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం ఫలితంగా ఆ భవనాల పనులు నిర్మాణాలకు నోచుకోవడం లేదు. చాలాచోట్ల పిల్లర్ల దశకే పనులు పరిమితం కాగా కొన్నిచోట్ల స్లాబ్ లెవల్‌కు చేరుకున్నాయి. మరికొన్నిచోట్ల లెంటల్ లెవల్ స్థాయిలో ఉన్నాయి.

26 చోట్ల ప్రారంభంకాని పనులు

జిల్లాలో ప్రారంభమైన పలు భవనాలు అసంపూర్తిగా ఉండగా చాలాచోట్ల ఇప్పటికీ పనులే ప్రారంభం కాలేదు. ఇందుకు స్థలాల సమస్యే కారణమని అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 26 గ్రామాల్లో ఈ సమస్య ఉండటం అధికారులు, ప్రజాప్రతినిధుల బాధ్యతారాహిత్యాన్ని స్పష్టం చేస్తోంది. పంచాయతీ భవనాల నిర్మాణానికి కేంద్రం నిధులు విడుదల చేస్తే వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన పాలకులు, అధికారులు తమకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఆదిలాబాద్‌రూరల్ మండలంలో 2, బేలలో 1, జైనథ్‌లో 6, బజార్‌హత్నూర్‌లో 5, బోథ్‌లో 3, ఇచ్చోడలో 4, నేరడిగొండలో 2, భీంపూర్‌లో 1, గుడిహత్నూర్ 1, తలమడుగులో 1, గాదిగూడలో 1 చొప్పున పంచాయతీలు ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేవని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారే తప్ప వాటిని గుర్తించేదిశగా చర్యలకు ముందుకు రావడం లేదు. పంచాయతీ, రెవెన్యూ అధికారులపై స్థలాల గుర్తింపు బాధ్యత ఉండగా వారి మధ్య సమన్వయం లేకపోవడం పంచాయతీలకు శాపంగా మారుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఆదిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

బిల్లులు సకాలంలో రాకపోవడంతోనే..

పంచాయతీ భవన నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. స్థలాల సమస్య కారణంగా పలుచోట్ల నిర్మాణాలు ప్రారంభించలేదు. స్థలాలు కేటాయించాలని జిల్లా ఉన్నతాధికారులతో పాటు రెవెన్యూ అధికారులకు సూచించాం. నిర్మాణాలు ప్రారంభించిన చోట పూర్తి చేసే దిశగా శ్రద్ధ వహిస్తున్నాం. అయితే పనులకు సంబంధించిన బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడం సమస్యగా మారింది.

– శివరాం రాథోడ్, పీఆర్ ఈఈ

క్లుప్తంగా

విషజ్వరంతో బాలిక మృతి


దీక్షిత (ఫైల్)

లక్సెట్టిపేట: విషజ్వరంతో బాలిక మృతి చెందింది. మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన దీక్షిత (12) కొన్నిరోజులుగా విషజ్వరంతో బాధపడుతుంది. కుటుంబీకులు..పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. రెండు రోజుల క్రితం జ్వరం ఎక్కువ కావడంతో వైద్యులు కరీంనగర్‌కు రెఫర్ చేయగా అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందింది. కుమార్తె మృతితో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాగా, దీక్షిత.. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతుంది.

మెట్ల పైనుంచి పడి ఒకరు..

నేరడిగొండ: మండల కేంద్రంలో ఓ యువకుడు ఇంటి మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతిచెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన బోగే అశోక్ (38) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. అప్పుడప్పుడు మద్యం సేవించేవాడు. ఆదివారం రాత్రి ఇంటికి వచ్చిన తర్వాత మెట్లు ఎక్కుతుండగా పైనుంచి జారి కిందపడడంతో తలకు తీవ్ర గాయమైంది. ఆటోలో పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోథ్ ఆస్పత్రికి తరలించారు. తల్లి నర్సమ్మ ఫిర్యాదుతో సోమవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

రైలు ఎక్కబోయి జారిపడి వ్యక్తి..

బాసర: మద్యం మత్తులో వ్యక్తి రైలు ఎక్కబోయి జారిపడి మృతిచెందాడు. బాసర రైల్వేస్టేషన్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. కుభీర్ మండలం సిరిపల్లికి చెందిన రావుసాబ్, సరిత దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు కృష్ణ (8), లక్కి(5). భార్యభర్తలు కూలీ పనిచేసుకుని జీవిస్తున్నారు. సోమవారం కూలీ పనికోసం మహారాష్ట్రలోని పండర్‌పూర్ వెళ్లేందుకు బాసర రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న రావుసాబ్.. పండర్‌పూర్ రైలు ఎక్కుతుండగా జారి పడి అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని బాలాజీనగర్‌లో వ్యభిచారం గృహంపై సోమవారం రాత్రి దాడి చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆ కాలనీలో గల ఓ ఇంట్లో మహిళ వ్యభిచారం నడిపిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. మహిళతోపాటు ముగ్గురు విటులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారివద్ద నుంచి రూ.3200 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

బడులకు నిధులొచ్చినయ్..

- తొలి విడత నిర్వహణ నిధులు మంజూరు
- ప్రత్యేకంగా క్రీడా నిధులు కూడా
- పాఠశాలల ఖాతాల్లో జమ
- హెచ్‌ఎంలకు తప్పనున్న భారం


మంచిర్యాల జెడ్పీ బాలుర పాఠశాల

మంచిర్యాలఅర్బన్: సర్కారు బడుల నిర్వహణకు సంబంధించిన తొలివిడత నిధులు మంజూరయ్యాయి. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన నిర్వహణ నిధులు(స్కూల్ గ్రాంటు), స్పోర్ట్స్ గ్రాంటు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. పాఠశాలలు పునఃప్రారంభమైన మూడు నెలలు గడిచిపోయినా పాఠశాల నిర్వహణ నిధులు రాకపోవడంతో హెచ్‌ఎంలు ఇబ్బందులు పడ్డారు. తరగతి గదిలో అవసరమైన చాక్‌పీస్, స్టేషనరీ, హాజరుపట్టిక పుస్తకాలతోపాటు ఏదైనా కొనుగోలు చేయాలంటే హెచ్‌ఎంలే సొంతంగా నిధులు వెచ్చించాల్సి వస్తోంది. ఈనేపథ్యంలో తొలివిడత నిర్వహణ 50 శాతం నిధులు పాఠశాలల ఖాతాలకు నేరుగా విడుదల కావడంతో ఊరటనిస్తోంది.

నిధులు మంజూరు ఇలా..

ప్రతిఏటా పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రత్యేక గ్రాంట్లు మంజూరవుతాయి. 1 నుంచి 30 వరకు విద్యార్థులుంటే రూ.10 వేలు, 31 నుంచి 100 వరకు రూ.25 వేలు, 101 నుంచి 250 లోపు రూ.50 వేలు, 251 నుంచి 1000 మంది వరకు రూ.75 వేలు, వెయ్యికిపైగా ఉంటే రూ.లక్ష చొప్పున నిధులిస్తారు. ఈ నిధులతో మరుగుదొడ్ల క్లీనింగ్‌కు అవసరమైన సామగ్రి కొనుగోలు, విద్యుత్, తాగునీరు, మరమ్మతు, స్టేషనరీ, ప్రయోగ సామగ్రి, సుద్దముక్కలు వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. జాతీయ పండుగల నిర్వహణ, కంప్యూటర్లు, ప్రాజెక్టర్ల నిర్వహణ, ఇంటర్నెట్, డిజిటల్ తరగతుల వరకు ఈ నిధులను వినియోగించుకోవాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొలివిడతలో 50శాతం నిధులు

జిల్లాలు	స్కూళ్ల సంఖ్య	స్కూల్‌గ్రాంటు(రూ.లు)	స్పోర్ట్స్ నిధులు(రూ.లు)	మొత్తం (రూ.లు)
ఆదిలాబాద్	1168	1,35,37,500	47,82,500	1,83,20000
మంచిర్యాల	760	85,30,000	34,45,000	1,19,75,000
నిర్మల్	762	1,00,67,500	34,75,000	1,35,42,500
ఆసిఫాబాద్	1018	1,09,07,500	38,12,500	1,47,20,000

క్రీడా నిధులు కూడా..

ప్రభుత్వ బడులకు విద్యాశాఖ ప్రత్యేకంగా క్రీడా నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతానికి 50 శాతం నిధులను పాఠశాలల యాజమాన్య కమిటీలకు ఎస్సీ, ఎస్టీ, జనరల్ కాంపొనెంట్ కింద మంజూరు చేశారు. ఈ నిధులను పాఠశాలల్లో క్రీడాభివృద్ధికి వినియోగించాల్సి ఉంటుంది. పాఠశాల స్థాయిని బట్టి పరికరాలు కొనుగోలు చేయడం, పిల్లలకు నైపుణ్యాలు వివరిస్తూనే పోటీలకు సన్నద్ధం చేయడం, తదితర అవసరాలకు ఉపయోగించాలి. ఏయే పరికరాలు ఎంతెంత వెచ్చించాలనే విషయాలను అధికారులు పొందుపర్చారు.

పరికరాలు కొనుగోలు ఇలా..

ప్రాథమిక స్థాయిలో క్రీడా పరికరాల కొనుగోలుకు రూ.5 వేలు కేటాయించారు. క్రికెట్ బ్యాట్లు, స్టంప్స్, చిన్న సైజు సాఫ్ట్‌బాల్, టెన్నీస్ బాల్, ప్లాస్టిక్ బాల్స్, ఫుట్‌బాల్స్, బాస్కెట్ బాల్స్, రబ్బీ సాఫ్ట్ బాల్ పలు క్రీడా పరికరాలు కొనుగోలు చేయాలి. ప్రాథమికోన్నత పాఠశాలల్లో రూ.10 వేలు, ఉన్నత పాఠశాలల క్రీడలకు రూ.25 వేలు చొప్పున కేటాయించారు. రబ్బర్ షాట్‌పుట్లు, స్కిప్పింగ్, రోప్, క్రికెట్ బ్యాట్లు, టెన్నీస్ బాల్, నెట్, హ్యాండ్ బాల్, త్రోబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, పెద్ద గోల్ఫ్ కోర్స్, ప్రాథమిక చికిత్స పెట్టె, సాసర్ కోన్, నిచ్చెన, ఇతర క్రీడా పరికరాలు కొనుగోలు చేయాలి.

హాస్టల్ నుంచి పారిపోయిన విద్యార్థి

- జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో ఘటన
- సమాచారంతో పట్టుకున్న బ్లూకోల్ట్స్ పోలీసులు


విద్యార్థిని హాస్టల్ సిబ్బందికి అప్పగిస్తున్న పోలీసులు

ఖానాపూర్: హాస్టల్ నుంచి విద్యార్థి పారిపోయిన ఘటన పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. ఎస్సై రాహుల్ కథనం ప్రకారం.. కడెం మండలం కొండుకూరు గ్రామానికి చెందిన నిక్షిత్ 5వ తరగతి చదువుతున్నాడు. అతనికి చదువుకోవడం ఇష్టం లేకపోవడం, ఇంటిపై బెంగతో ఆదివారం రాత్రి హాస్టల్ నుంచి పారిపోయాడు. పరిసరాల్లో తిరుగుతున్న విద్యార్థిని ఓ వ్యక్తి గమనించి డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. బ్లూకోల్ట్స్ పోలీసులు సంతోశ్, సుధీర్ అక్కడికి వెళ్లి విద్యార్థిని పట్టుకుని తిరిగి హాస్టల్ సిబ్బందికి అప్పగించారు.

మహిళల్లో చైతన్యం కోసమే ఇందిరా ఫెలోషిప్



అవగాహన కల్పిస్తున్న ఆత్రం సుగుణ

ఆదిలాబాద్‌రూరల్: మహిళల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఇందిరా ఫెలోషిప్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు, ఇందిరా ఫెలోషిప్ ఉమ్మడి జిల్లా యూనిట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. మావల మండల కేంద్రంలో ఫెలోషిప్ సభ్యులకు సోమవారం బూట్ క్యాంప్ వర్క్‌షాప్ నిర్వహించారు. రాజకీయాల్లో మహిళల పాత్ర, వారు ఎదుర్కొంటున్న సవాళ్లు, భవిష్యత్తు అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శక్తి అభియాన్‌లో భాగంగా ఉమెన్ ఎంపవరింగ్, ట్రాన్స్‌ఫార్మింగ్ పాలిటిక్స్ అనే లక్ష్యంతో ఇందిరా ఫెలోషిప్ సంస్థను రాహుల్‌గాంధీ ఆలోచనతో వివిధ రాష్ట్రాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్నివర్గాల మహిళలను ఎంపిక చేసుకుని వారికి ఇందిరా ఫెలోషిప్ పేరిట ఆర్థిక సహకారం అందిస్తామన్నారు.తెలంగాణ కోఆర్డినేట్ శివలాల్ నేతికల్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నగేశ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్ గౌడ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్‌లో ఈనెల 19, 20 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో ఉట్నూర్, జాతర్ల క్రీడా పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ప్రతిభకనబర్చారు. అండర్ –14 విభాగంలో అథ్లెటిక్స్‌లో రాథోడ్ కార్తీక్‌కు (బంగారు), హెరకుమ్ర నగేశ్‌కు (కాంస్య), అండర్ 14–లో కిడ్స్ జావెలిన్ త్రోలో కోట్నాక్ జాకేశ్‌కు (కాంస్య), 60 మీ.ల పరుగులో రాథోడ్ విక్రమ్‌కు (కాంస్య), అండర్–16లో జావెలిన్‌త్రోలో పెందూర్ సతీశ్‌కుమార్ (కాంస్య) పతకాలు దక్కించుకున్నారు. వారితోపాటు కోచ్ జి.సునంద్‌లను ఏసీఎంవో అర్క జగన్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి అభినందించారు. కార్యక్రమంలో పీడీ జాదవ్‌మేమంత్, కోచ్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


అర్జీలు స్వీకరిస్తున్న ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో గిరిజనుల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ అర్జీలను సంబంధిత అధికారులు పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, ఏడీ ఎంఅండ్‌వో కుడిమెత మనోహర్, ఏవో దామోదర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, జేడీఎం నాగభూషణం, పెసా కోఆర్డినేటర్ సవంత్‌రావు, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, సిబ్బంది పాల్గొన్నారు.

- తన పైచదువుల కోసం ఆర్థికసాయం అందించాలని ఉట్నూర్ మండలం బీర్సాయిపేటకు చెందిన వైష్ణవి అర్జీ అందించింది.
- తనకు ఉద్యోగం ఇప్పించాలని ఇంద్రవెల్లి మండలంవడ్గాం గ్రామానికి చెందిన సునీత వేడుకుంది.
- ఉట్నూర్ మండలం మారుతీగూడకు మినీ అంగన్‌వాడీ మంజూరు చేయాలని జంగుబాయి విన్నవించింది.
- తన పంట భూమికి పట్టా ఇప్పించాలని ఇంద్రవెల్లి మండలం దుబ్బగూడకు చెందిన కోవ హన్మంత్‌రావు అర్జీ అందించాడు.

'ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ విద్రోహులను నిలదీయండి'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సింగరేణి గనులు, డిపార్ట్‌మెంట్ల వద్దకు వచ్చే ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ విద్రోహులను నిలదీయడమే కాకుండా తరిమికొట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ సోమవారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. లాభాల వాటా పంపకంలో పెరిగిన ఒక్క శాతంపై ఇది తమ ఘనత అంటూ కార్మికులను మోసగించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా 20శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


డి.ప్రేమ్‌దీప్

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌కు చెందిన డి. ప్రేమ్‌దీప్ జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి తెలిపారు. హర్యానా రాష్ట్రం రోతక్ జిల్లాలో ఈనెల 25 నుంచి 29 వరకు జరగబోయే 43వ సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి జిల్లా జట్టు నుంచి ప్రేమ్‌దీప్ పాల్గొంటారని వివరించారు. అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, ఏరియా జీఎం శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి, జిల్లా అధ్యక్షుడు నరసింగం తదితరులు ఈ సందర్భంగా ప్రేమ్‌దీప్‌ను అభినందించారు. సింగరేణి ఉన్నత పాఠశాలకు చెందిన ఈయన జాతీయ పోటీల్లో సత్తాచాటాలని పలువురు ఆకాంక్షించారు.

మున్నూరు కాపు సంఘం జిల్లా ఇన్‌చార్జిగా లక్ష్మణ్


లక్ష్మణ్

జన్నారం: మున్నూరు కాపు సంఘం నిర్మల్ జిల్లా ఇన్‌చార్జిగా జన్నారం మండలం బాదంపల్లి గ్రామానికి చెందిన కాసెట్టి లక్ష్మణ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం అపెక్స్ కౌన్సిల్ రాష్ట్ర కన్వీనర్ పురుషోత్తంరావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. జన్నారం మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్న లక్ష్మణ్ సేవలు గుర్తించి ఈ పదవి అప్పగించారు. తనకు బాధ్యతలు అప్పగించిన నాయకులకు ఈ సందర్భంగా లక్ష్మణ్ కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌వో మీనారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ విభాగంలో పురుషులు, మహిళలకు ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ ఆధార్ కార్డు, పాస్‌ఫొటోతో రావాలని సూచించారు. కోచ్ అరవింద్‌కు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సెల్ 9866 395859, 9550909870 నంబర్లలో సంప్రదించాలన్నారు.

హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో బ్లాక్ డే


కోడ్ పత్రాలను దహనం చేస్తున్న నాయకులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై సోమవారం హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో బ్లాక్ డే నిర్వహించారు. ఇందులో భాగంగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి కార్మిక కోడ్ పత్రాలను దహనం చేశారు. హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 చట్టాలను 4 కోడ్‌లుగా మార్చడాన్ని అన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. కేంద్రం కార్మికుల హక్కులు హరించడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ బ్లాక్ డేగా నిరసన చేపట్టామని తెలిపారు. లాభాల వాటాలో నికర లాభంపై 33 శాతం ఇవ్వాల్సి ఉండగా, సంస్థ అభివృద్ధికి రూ.2200 కోట్లు తీసుకుని రూ.2490 కోట్లలో వాటా ప్రకటించడం కార్మికులను మోసం చేయడమేనన్నారు. సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పార్వతి రాజిరెడ్డి, డెప్యూటీ జనరల్ సెక్రెటరీ సుదర్శన్, నాయకులు ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, చొప్పరి రామస్వామి, థామస్, ప్రభాకర్, ప్రదీప్ తదితరులు ఉన్నారు.

'లాభాలపై తప్పుడు ప్రచారం'


మాట్లాడుతున్న ముస్కే సమ్మయ్య

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ సాధించిన లాభాలు, వాటాపై కొన్ని సంఘాల నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య మండిపడ్డారు. శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో సోమవారం గేట్ మీటింగ్ నిర్వహించి కార్మికులతో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం సంస్థ సాధించిన లాభాల నుంచి ఏ విధంగా వాటా చెల్లిస్తున్నారో ఈసారి కూడా అదేవిధంగా చెల్లించనున్నారన్నారు. నికర లాభం మీదనే ప్రతిసారి కార్మికులకు వాటా పంపిణీ చేస్తారని తెలిపారు. గడిచిన రెండు పర్యాయాలు గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ నాయకులకు అవగాహన ఉండి కూడా ఇలా మాట్లాడడం సరికాదన్నారు. ఈసారి తాము అదనంగా ఒక శాతం పెంచి ఇప్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఫిట్ సెక్రెటరీ గురిగంటి నర్సింగరావు, చల్ల తిరుపతి, సాయిరాజ్ నాయకులు శ్రీనివాస్, నారాయణ, రాజేందర్, అశోక్‌రెడ్డి, ఈశ్వర్ లచ్చన్న పాల్గొన్నారు.

ఎస్టీపీపీ కార్మికులకు లాభాల వాటా చెల్లించాలి


ఈడీ రాజశేఖర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

జైపూర్: ఎస్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటాగా ప్రతి కార్మికుడికి రూ.10 వేలు చెల్లించాలని హెచ్‌ఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. హెచ్‌ఎంఎస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ చిప్పకుర్తి సంపత్, సాయికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఏటా సింగరేణి సంస్థ సాధించే లాభాల్లో ఎస్టీపీపీ నుంచి వేల కోట్ల లాభాలు ఆర్జిస్తుందని నిరంతరం విద్యుత్ ఉత్పత్తికి కష్టపడుతున్న కార్మికులకు బోనస్ చెల్లించాలని కోరగా ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

కట్నం వేధింపులకు వివాహిత బలి


లహరి మృతదేహం

జైపూర్: అదనపు వరకట్నం వేధింపులకు వివాహిత బలైంది. మండలంలోని ఇందారం గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై శ్రీధర్ కథనం ప్రకారం.. ఇందారం గ్రామానికి చెందిన రమేశ్‌తో నస్పూర్‌కు చెందిన ఇండ్ల లహరి (21)కి 2021లో వివాహమైంది. వీరికి 18 నెలల పాప ఉంది. పెళ్లయిన కొంతకాలానికి భర్త రమేశ్, అత్తారింటివారు కట్నం కోసం ఆమెను వేధించసాగారు. పెళ్లిలో తక్కువ కట్నం ఇచ్చారని అదనంగా మరో రూ.2 లక్షలు తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా చిత్రహింసలకు గురిచేశారు. వేధింపులు భరించలేక లహరి సోమవారం ఇందారంలోని ఇంట్లో ఉరేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో దూకి విద్యార్థి ఆత్మహత్య

నిర్మల్‌రూరల్: చదువుకోవడం ఇష్టం లేక విద్యార్థి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం..మండలంలోని వెంగ్వాపేటకు చెందిన సాద అభి (17) నిజామాబాద్‌లో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. గత 15 రోజుల క్రితం బంధువుల అంత్యక్రియలకు వచ్చి ఇంట్లోనే ఉంటున్నాడు. రెండు, మూడుసార్లు కళాశాలకు వెళ్లమని కుటుంబ సభ్యులు చెప్పినా అభి వినలేదు. సోమవారం తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన అభి.. గ్రామంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నటున్ల పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

బేల: మండలంలోని జూనోని గ్రామానికి చెందిన గుర్నులే మధుకర్ (35) సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాధిక తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. మధుకర్ గత రెండేళ్లగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య రేణుక ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అటవీ భూములు సాగుచేసిన ఐదుగురి రిమాండ్


రిమాండ్‌కు తరలిస్తున్న వారితో అధికారులు

చింతలమానెపల్లి: మండలంలోని దిందా శివారులో అటవీభూములు సాగు చేస్తున్న ఐదుగురిని అటవీ అధికారులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. సెక్షన్ అధికారి మోహన్ కథనం ప్రకారం.. ఖర్జెల్లి రేంజ్ పరిధిలోని బందెపల్లి బీట్‌లో దిందా గ్రామానికి చెందిన నికాడె సుశీల, దోకె మాంతయ్య, మడె నారాయణ, ధన్నూరి రాజేశ్, దండ్రె శేఖర్‌లు అటవీ భూమి సాగు చేశారు. 178, 179 కంపార్ట్‌మెంట్లలో 7 ఎకరాల భూమిలో చెట్లు నరికి, అటవీ భూమిని ఆక్రమించుకుని కంచెలు వేసుకున్నారు. సమాచారం అందడంతో అధికారులు.. ఐదుగురిని అదుపులో తీసుకుని కేసు నమోదు చేశారు. వీరిని సిర్పూర్(టి) సివిల్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి..15 రోజుల రిమాండ్ విధించారని సెక్షన్ అధికారి తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం

కౌటాల: మండలంలోని గుండాయిపేటకు చెందిన రైతు మండొగాడే పత్రు తన భార్యతో కలిసి పురుగుల మందు డబ్బాతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. గుండాయిపేటకు చెందిన మండొగాడే పత్రు, ఎల్ములే బాబురావులకు ఐదెకరాల భూమి సంబంధించి గత కొంతకాలంగా వివాదం నడుస్తుంది. ఇటీవల బాబురావు ఐదెకరాల్లో పత్తి సాగు చేయగా.. ఈ భూమి తనదనని మండొగాడే పత్రు.. పత్తి పంటపై గడ్డి మందుతో పిచికారీ చేశాడు. పంటకు నష్టం జరిగిందని బాబురావు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. రెవెన్యూ అధికారులు ఇటీవల పంటను పరిశీలించారు. బాబురావు సాగుచేస్తున్న భూమి తనదేనని, తనకు అధికారులు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పత్రు పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై విచారణ చేపడుతామని తహసీల్దార్ పుష్పలత తెలిపారు.

బెదిరింపులకు పాల్పడుతున్న విలేకరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవీందర్

చెన్నూర్: అమాయక ప్రజలను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్న పట్టణానికి చెందిన విలేకరి కనుకుంట్ల వెంకట్రాజ్ అరెస్టు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఎన్‌జీవో కాలనీకి చెందిన గంగిరెడ్డి రాజేశంను వెంకట్రాజ్ రూ.50 వేలు డిమాండ్ చేయగా రూ.5 వేలు ఫోన్ పే చేశాడు. ఇంకా డబ్బులు కావాలని వేధించాడు. బొమ్మ శ్రీనివాస్‌రెడ్డి తన సొంత భూమిలో మొరం తవ్వుతుండగా రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. నాయిని తిరుపతి పండ్ల వ్యాపారి షెడ్డు నిర్మిస్తుండగా అక్రమంగా వేస్తున్నారని బెదిరించి రూ.50 వేలు డిమాండ్ చేయగా రూ. 31 వేలు ఇచ్చాడు. గుర్రం సుధాకర్ చికెన్ సెంటర్ నిర్మిస్తుండగా అతని నుంచి రూ.5 వేలు వసూలు చేశాడు. విలేకరి ముసుగులో ప్రజలను భయపెడుతూ డబ్బులు వసూలు చేస్తున్నాడని సదరు యాజమానుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి వెంకట్రాజ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై తదితరులు పాల్గొన్నారు.